క్లుప్తంగా

అంగన్‌వాడీ సెంటర్లలో పోషకాహారం

ములకలపల్లి: గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిమ్మంపేట సర్పంచ్ గౌరిలక్ష్మి సూచించారు. మండలపరిధిలోని తిమ్మంపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రీస్కూల్ విద్యార్థిని జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాధవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

బెంచీలు వితరణ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తాళ్లూరి భారతీదేవి జ్ఞాపకార్థం తాళ్లూరి పంచాక్షరయ్య, వారి కుమారుడు, మాజీ తానా అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్లు 50 సిమెంట్ బెంచీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా గురువారం వాటిని పంచాక్షరయ్య కళాశాల బృందంతో కలిసి ప్రారంభించారు. అనంతరం పంచాక్షరయ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.భద్రయ్య, అధ్యక్షతన ప్రత్యేక ఆహ్వానితులు పూర్వ ప్రధానాచార్యులు తిప్పన సిద్దులు, సీపీడీసీ మెంబర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి, ఉప ప్రధానాచార్యులు నరేందర్ రెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ వేములు కామేశ్వరరావు, ప్రముఖ కవి చిగురుమల్ల శ్రీనివాస్, అడుసుమిల్లి జగదీష్, చావా లక్ష్మీనారాయణ, పి.దేశప్ప, వంశీకృష్ణ, బి.శ్రీనివాస్, సిహెచ్ శ్రీనివాస్, ఎం.వీరయ్య, కళాశాల అధ్యాపకులు శ్యాంప్రసాద్ రెడ్డి, వీరన్న, జాయి కిరణ్ మోత్కూరి, రాంబాబు పాల్గొన్నారు.

ముత్యాల మండపానికి వెండి..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని దాసాంజనేయ స్వామి ముత్యాల మండపానికి 250 గ్రాముల వెండిని భక్తులు గురువారం ఆలయ కమిటీకి అందజేశారు. గుళ్ల కార్తీక్ సీతారామారావు, దమయంతిల జ్ఞాపకార్థం వెంటక నాగభూషణం విమల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు తోట శేషు, ప్రధాన కార్యదర్శి కటుకూరి హరిబాబు, కోశాధికారి గుడుమాసు లక్ష్మణకుమార్, శ్రీనివాస్, తోట శ్రీనివాస్ అర్చకులు కిరణ్ కుమార్ శర్మ, పవన్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'కంటి వెలుగు' శిబిరం

చర్ల: మండలంలోని చర్ల, సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలల పరిధిలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాలు శుక్రవారం నుంచి సత్యనారాయణపురం, రాళ్లగూడెం గ్రామాల్లో ప్రారంభమవుతాయని వైద్యాధికారులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ దివ్యనయన తెలిపారు. చర్ల వైద్యశాల పరిధిలో ఉన్న రాళ్లగూడెం ఎంపీయూపీఎస్ పాఠశాల, సత్యానారాయణపురం ప్రభుత్వ వైద్యశాల పరిధిలో ఉన్న సత్యనారాయణపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లలో ఈ శిబిరాలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. 18 యేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాలకు వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవచ్చునని వైద్యాధికారులు తెలిపారు.

ఆలయంలో పూజలు

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణానికి చెందిన పల్నాటి శ్రీనివాసరావు దంపతులు కుటుంబ సమేతంగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వారు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించి తరించారు. అనంతరం అన్నదాత శ్రీనివాసరావు దంపతులను ఆలయ కమిటీ వారు శాలువాతో సన్మానించి జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలి

మణుగూరురూరల్: మండల పరిధిలోని లంకమల్లారం గ్రామపంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు డిమాండ్ చేశారు. గురువారం ఆయన లంకమల్లారం గ్రామంలో పర్యటించి మంచినీటి సమస్యపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చేది వేసవికాలమవడంతో మండల వ్యాప్తంగా మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు టీవీ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చర్ల: మండల కేంద్రంలోని సీఆర్‌కాలనీలో జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి మేమున్నాం సహాయక కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. సహాయక సమితీ చైర్మన్ నీలి ప్రకాశ్ నేతృత్వంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కమిటీ సభ్యులు.. రూ.6 వేల నగదుతోపాటు సుమారు 5 వేల విలువ చేసే నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎంఎస్ నాయుడు, దొడ్డా ప్రభుదాస్, తాండవ రాయుడు, ఇర్పవర్ల రాము, దొడ్డి సూరిబాబు పాల్గొన్నారు.

శిథిలావస్థలో మున్సిపల్ కార్యాలయం

- పెచ్చులూడుతున్న పైకప్పులు
- ఇరుకు గదుల్లోనే పాలన
- అవస్థలు పడుతున్న ఉద్యోగులు



పెచ్చులు రాలిపోయి కనిపిస్తున్న కార్యాలయంలోని స్లాబ్



మణుగూరు మున్సిపల్ కార్యాలయం..

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు సేవలు అందించడానికి ఏర్పాటు చేసిన మున్సిపల్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. సుమారు నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం.. తొలుత పంచాయతీ కార్యాలయంగా కొనసాగింది. కాలక్రమంలో మణుగూరు పంచాయతీ మున్సిపాలిటీగా మార్చడం జరిగింది. మున్సిపాలిటీగా ఏర్పాటై 18 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ మున్సిపాలిటీకి ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయకపోవడంతో అదే పంచాయతీ కార్యాలయం మున్సిపాలిటీ కార్యాలయంగా కొనసాగుతోంది. ప్రస్తుతం మున్సిపాలిటీ కార్యాలయంలోని స్లాబ్ పూర్తిగా పెచ్చులు పెచ్చులుగా రాలిపడిపోతుంది. దీంతో స్లాబ్ రాడ్స్ కూడా బయటకు కనిపిస్తున్నాయి.

ఇరుకు గదులతో ఇబ్బందులు

మణుగూరు మున్సిపాలిటీ కార్యాలయంలో అందరికీ సరిపడా గదులు లేకపోవడంతో ఉన్న వాటిలోనే సిబ్బంది పార్టీషన్‌గా చేసుకుని విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీలో ఎటువంటి సమావేశాలు ఏర్పాటు చేయాలన్నా కనీస సమావేశ మందిరం లేదు. పంచాయతీ కార్యాలయం కోసం ఏర్పాటు చేసిన దానిలోనే నేటికి మున్సిపాలిటీ కొనసాగడంతో ఉద్యోగులు సర్దుకుని విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

మెప్మా కార్యాలయం సైతం ఈ భవనంలోనే కొనసాగుతోంది. ఉన్న వాహనాలు పెట్టుకోవడానికి సైతం పరిసరాల సరిపోక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోకముందే మణుగూరు మున్సిపాలిటీకి ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసి కార్యాలయంలోని అన్ని విభాగాలకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని మున్సిపాలిటీ ఉద్యోగులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు తెలియజేశాం..



మున్సిపల్ కార్యాలయం పాడై పోతున్న విషయం ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రత్యేక మున్సిపల్ కార్యాలయం నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే సహకారంతో మణుగూరు తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో నిర్మించడానికి ప్రతిపాదనలు పంపించాం. సాధ్యమైనంత త్వరలో అక్కడ నూతన కార్యాలయం భవన నిర్మాణం జరిగే అవకాశాలు ఉన్నాయి.

– మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్

ఆదివాసీల గుడిసెల తొలగింపు



పోలీసులు గుడిసెలను తొలగించిన ప్రదేశం ఇదే..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని రాజుపేట కాలనీ శివారులో గిరిజనులు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను అధికారులు గురువారం తెల్లవారు జామున తొలగించారు. గత మూడు నెలల క్రితం గిరిజనులు ప్రభుత్వ భూములు, పలువురి పట్టా భూములను ఆక్రమించి గుడిసెలను వేసుకున్నారు. దీంతో అధికారులు వాటిని తొలగించాలని, ఎవైన సమస్య ఉంటే చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలని గిరిజనులకు సూచించారు. అనంతరం గుడిసెలు ఏర్పాటు చేసుకున్న వారికి నోటీసులను జారీ చేశారు. అయిన వారు స్పందించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానిక పోలీసులు గుడిసెలు వేసిన ప్రదేశానికి వెళ్లి జేసీబీ సహాయంతో తొలగించారు. కాగా, సాయంత్రం కూడా బాధితులు ఆ స్థలానికి చేరుకున్నారు. దీంతో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సహకారంతో పోలీసులు సర్దిచెప్పి పంపించారు.

గుడిసెల తొలగింపుపై ఖండన

దుమ్ముగూడెం: ఆదివాసీల గుడిసెలు కూల్చటం, ప్రభుత్వ దమన నీతికి పరాకాష్ట అని టీడీపీ మండల అధ్యక్షుడు కొమరం దామోదరరావు, ఏవీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజులు గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు.

భద్రాచలంలోని గురుకులబాలికల వసతి గృహం పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని, జీవనం సాగిస్తున్న ఆదివాసీలపై రాత్రి పూట వచ్చి జేసీబీలతో పడుకుని నిద్రపోతున్న అడవి బిడ్డలపై వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ, గుడిసెలు కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆ భూముల్లోనే వారికి ఇళ్ల స్థలాల పత్రాలు ఇచ్చి, డబుల్ బెడ్రూం పథకంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రేవంత్‌రెడ్డిపై దాడులు అమానుషం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే వీరయ్య, కాంగ్రెస్ నాయకులు

బూర్గంపాడు: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ దాడులు అమానుషమని డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆరోపించారు. సారపాక ప్రధాన కూడలిలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టి బీఆర్ఎస్ నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పొదెం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ నేతలపై దాడులకు పాల్పడటం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. దాడికి ప్రతిదాడులు చేయకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు హుందాగా నడుచుకుంటున్నాయన్నారు. పాదయాత్రలో రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను, బీఆర్ఎస్ నాయకులు అక్రమాలను వెలుగులోకి తీసుకోస్తుండటంతో దాడులకు దిగుతున్నారన్నారు. ప్రజలు బీఆర్ఎస్ నాయకులకు బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు తాళ్లూరి చక్రవర్తి, బట్టా విజయ్‌గాంధీ, మారం వెంకటేశ్వరరెడ్డి, కణితి కృష్ణ, దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, చల్లా వెంకటనారాయణ,మందా నాగరాజు, మహమ్మద్‌ఖాన్, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి,గౌనె రేణుక, తాటి వీరాంజనేయులు. బొర్రా భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ

మణుగూరురూరల్: కొత్తగూడెంలో ఏప్రిల్ 2,3 తేదీల్లో జరగబోయే ఇఫ్టూ తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్ పోస్టర్లను గురువారం ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ కూనవరం రైల్వేగేట్ సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంగీలాల్ మాట్లాడుతూ.. ఈ మహాసభలకు ఇఫ్టూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎం.శ్రీనివాస్, ఆరెల్లి కృష్ణ, జె.సీతారామయ్య, విశ్వనాథం, ఎండి.రాసుద్దీన్‌లు హాజరుకానున్నారని తెలిపారు. ఇఫ్టూ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవికుమార్, గురుమూర్తి, నాగేశ్వరరావు, శంకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మరమ్మతులు



ఆర్‌డీ 8 కాలువలో పనులు చేస్తున్న ప్రొక్లెయినర్

చర్ల: మండలంలో రైతుల ప్రధాన సాగునీటి వనరు అయిన తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్రధాన కాలువల మరమ్మతు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఓటీల నిర్మాణాలు, కాలువల్లో చెట్ల తొలగింపు, షిల్టు తీయడం, కాలువల బ్యాంకింగ్ ఎత్తు పెంచడం వంటి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కుడి ప్రధాన కాలువ కింద ఉన్న ఆర్‌డీ 8, ఆర్డీ 12 ప్రధాన కాలువలకు సంబంధించి పనులు చేపట్టిన ఇరిగేషన్ అధికారులు.. మరో వారం రోజుల్లో ఈ పూర్తి చేయనున్నారు. ఆర్‌డీ కింద పోడు భూములతో కలుపుకుని సుమారు 400 ఎకరాల్లో రైతులు సాగు చేస్తుండగా, ఆర్‌డీ 12 క్రింద సుమారు 650 ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేస్తున్నారు. కాలువలకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో వానాకాలం, రబీలో పంటలను సాగు చేస్తున్న రైతుల పొలాలకు పర్తి స్థాయిలో సాగునీరు అందక చివరి పొలాల్లో పంటలు ఏటా ఎండిపోతున్నాయి. దీంతో పలుమార్లు రైతులు కాలువలకు మరమ్మతులు చేపట్టాలంటూ చేసిన విజ్ఞప్తి మేరకు స్పందించిన అధికారులు.. కాలువలకు మరమ్మతులు చేపట్టారు. ఆర్‌డీ 8 కాలువకు రూ.2.60 లక్షలు, ఆర్‌డీ 12 కాలువకు రూ.4.64 లక్షలు మంజూరు కాగా ఈ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పదికాలాల పాటు కాలువలు పటిష్టంగా ఉండేలా అధికారులు దగ్గరుండి పనులను చేయించాలని రైతులు కోరుతున్నారు.

వ్యక్తిపై దాడి?

ములకలపల్లి: వ్యక్తిగత పనులపై పాల్వంచకు కారులో వెళ్లి తిరిగివస్తుండగా కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారని సీతారాంపురం గ్రామానికి చెందిన సున్నం ముత్తయ్య ఆరోపించారు. బుధవారం రాత్రి పాల్వంచ నుంచి వస్తూ సీతారాంపురం శివారులో మూత్రవిసర్జన కోసం కారు నుంచి కిందికి దిగిన సమయంలో కొందరు వ్యక్తులు దాడికి తెగబడ్డారని, తాను భయంతో కేకలు వేయగా గ్రామస్తులు రావడంతో వారు పారిపోయారని తెలిపారు. ఈ అంశంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని చెప్పారు. కానీ, ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌హెచ్‌ఓ తిరుమల్ రావు వెల్లడించారు.

పీఆర్సీని అమలు చేయాలి

భద్రాచలంఅర్బన్: విద్యుత్ సంస్థలో 2022 మార్చి నెలలో ఇవ్వాల్సిన పీఆర్సీని అమలు చేయాలని, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ వెంటనే అమలు చేయాలని టీఎస్పీఈ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యం వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి తమకు సహకరించాలని కోరారు.

ఆలయ వార్షికోత్సవం

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని జానకీపురం గ్రామ శివారులో ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయ సప్తమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి విచ్చేసి, బోనాలను అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అమ్మ వారిని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వనమా గాంధీ దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు.

వృద్ధురాలికి చేయూత

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన యువత సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కొందరు యువకులతో కలిసి యువ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. తుమ్మలచెరువు గ్రామ పంచాయతీలోని రామవరం గ్రామంలో పూరిల్లు దగ్ధమై నిరాశ్రయురాలైన వృద్ధురాలు గుల్ల సుశీలమ్మకు యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర వస్తువులు అందజేసి ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఆర్గనైజింగ్ సభ్యులు మానాది సైదులు, జెట్టి సాంబయ్య, సభ్యులు, యువత పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

అశ్వాపురం: పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో మండల పరిధిలోని మొండికుంట గ్రామంలోని యువతకు గురువారం స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కమటం నరేష్ వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులసాని రామిరెడ్డి, చిట్యాల సత్యం, పర్వత నరేష్, కొమరం శ్రీను, చెన్నూరి వీరభద్రం, మహేష్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతకు ప్రోత్సాహం

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పంచాయతీ సర్పంచ్ తెల్లం వరలక్ష్మి పంచాయతీ పరిధిలోని గోవిందాపురం గ్రామంలోని క్రికెట్ ఆటగాళ్లకు సొంత నగదుతో బ్యాట్లు కొని గురువారం అందజేశారు. గోవిందపురం గ్రామంలో క్రికెట్ ఆడాలని ఆశ ఉన్నప్పటికీ ఆడుకోవడానికి బ్యాట్లు లేకపోవడంతో ఎక్కడ టోర్నమెంట్‌కి వెళ్లలేకపోతున్నారు. ఈ విషయాన్ని సర్పంచ్‌కి తెలియజేయడంతో గ్రామంలో ఉన్న వంటి యువత క్రీడల్లో రాణించాలని ఉద్దేశంతో వెంటనే గోవిందపురం యువతకు మూడు క్రికెట్ బ్యాట్లు అందజేసి వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు తెల్లం హరికృష్ణ, యువత కొమరం గజేందర్, కురసం సమ్మయ్య, బాలకృష్ణ, అరవింద్, నరేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రూనింగ్ పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మిడియం బాబురావు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నియోజకవర్గంలో వేసవి పంట అయిన తునికాకు సేకరణ ప్రూనింగ్ పనులను వెంటనే చేపట్టాలని, తునికాకు బోనస్ వెంటనే చెల్లించాలని సీపీఎం రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ భద్రాచలం పట్టణ కమిటీ సమావేశం ఎంబీ నర్సారెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా మిడియం మాట్లాడుతూ.. భద్రాచలం నియోజకవర్గంలో 2017 నుంచి చెల్లించవలసిన తునికాకు పెండింగ్ బోనస్‌ను ప్రభుత్వం విడుదల చేస్తున్నట్లు ప్రకటించిందని, వెంటనే బోనస్ చెక్కులను నేరుగా తునికాకు కార్మికులకు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని విమర్శించారు. సమావేశంలో పార్టీపట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు బండారు శరత్ బాబు, సున్నం గంగా, వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్, నాదెళ్ల లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు ఎస్. నాగరాజు, డి.సీతాలక్ష్మి, బి.కుసుమ, యు.జ్యోతి, జీవన జ్యోతి, సీహెచ్.మాధవరావు, ఎస్‌డి.ఫిరోజ్ ఖాన్, కోరాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతోనే మేలుజాతి పశువులు



మేలుజాతి దూడల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

బూర్గంపాడు: పశువులలో కృత్రిమ గర్భధారణతో మేలుజాతి దూడలను పొందవచ్చని ఐటీసీ ఎంఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.సర్వేశ్వరరెడ్డి అన్నారు. ఐటీసీ బంగారు భవిష్యత్ ప్రోగ్రామ్‌లో భాగంగా బైఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం మోరంపల్లిబంజర గ్రామంలో మేలు జాతి దూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, స్థానిక సర్పంచ్ భూక్యా దివ్యశ్రీలు ప్రారంభించారు. మేలుజాతి పశుసంతతి కోసం పాడిరైతులు తమ పశువులకు బైఫ్ సంస్థ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ చేయించుకోవాలని సూచించారు. మేలుజాతి పశుసంతతి కోసం ఐటీసీ సహకారంతో బైఫ్ సంస్థ అందిస్తున్న సేవలను పాడిరైతులు వినియోగించుకోవాలని జెడ్పీటీసీ శ్రీలత, సర్పంచ్ దివ్యశ్రీ అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ సయ్యద్ మీరజ్, హేమంత్, సదయ్య, వెంకటరామిరెడ్డి, పాడిరైతులు పాల్గొన్నారు.

మహిళల హక్కులపై అవగాహన

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని కుదుములపాడు గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మహిళల హక్కులు, లింగ వివక్ష, చట్టాల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా సీడీపీఓ రోజారాణి మాట్లాడుతూ.. ప్రతి మహిళా తమ హక్కులు, చట్టాలు, వివక్ష గురించి తెలుసుకోవాలని అన్నారు. చిన్నారులకు వయస్సు తగిన విధంగా సమతుల ఆహారాన్ని అందించాలని, బాల్య వివాహాలు చేయవద్దని అవగాహన కల్పించారు.

క్రీడా పోటీలు..

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 4న శనివారం సాయంత్రం 5 గంటలకు టగ్ ఆఫ్ వార్, బాల్‌త్రో, బాల్ ఇన్ బాస్కెట్, బాంబ్ ఇన్ సిటీ మొదలగు క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. క్రీడా పోటీలను స్థానిక భద్రాద్రి స్టేడియంలో నిర్వహించే ఈ పోటీలకు మణుగూరు ఏరియా సింగరేణి కుటుంబాలకు చెందిన మహిళలు యువతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సేవాలాల్ జయంతి

అన్నపురెడ్డిపల్లి: బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాన్ని గురువారం అన్నపురెడ్డిపల్లిలో ఘనంగా నిర్వహించారు. బంజారాలు సంప్రదాయ దుస్తులు ధరించి, నృత్యాలు చేశారు. అనంతరం గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో బోగ్ బండారా కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ బోడా పద్మ, కాంగ్రెస్ నాయకులు వనమా గాంధీ, భీముడు, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కేశవనాయక్, గురువు బొజ్జనాయక్, నాయకులు దారావత్ వెంకటేశ్వర్లు, దారావత్ శ్రీను, భూక్య చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

దమ్మపేట: మండల పరిధిలోని వినాయకపురం గ్రామపంచాయతీలో నివసిస్తున్న గిరిజనులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును కోరారు. ఆ మేరకు గురువారం స్వగృహంలో ఎమ్మెల్యేను కలిసిన నాయకులు గండుగులపల్లి జీపీలో ప్రజాపంథా ఆధ్వర్యంలో నిర్మించిన నూతన కాలనీకి సీసీ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రజాపంథా పాల్వంచ డివిజన్ కార్యదర్శి అమర్లపూడి రాము, జిల్లా నాయకులు గోకినపల్లి ప్రభాకర్, మండల నాయకులు ఆదినారాయణ, ముత్యాలరావు, బొంతకుమార్, శ్రీను, లక్ష్మయ్య, నర్సింహారావు ఉన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై ఆందోళన



బూర్గంపాడు: సారపాకలో కట్టెల పొయ్యితో వంట చేస్తూ సీపీఐ నాయకుల నిరసన..

బూర్గంపాడు: గ్యాస్ సిలెండర్ ధరల పెంపును నిరసిస్తు సీపీఐ మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం సారపాకలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సారపాకలోని పార్టీ కార్యాలయ ఆవరణలో కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ముువ్వ వెంకటేశ్వరరావు, పేరాల శ్రీనివాస్, అలవాల సీతారామిరెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, జహీర్, బాలకృష్ణ, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి కెచ్చల కల్పన డిమాండ్ చేశారు. పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలోని పార్టీ కార్యాలయం ఎదుట గ్యాస్ బండతో పట్టణ మహిళా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమారి, నాగరత్నం, రమ, షకీర తదితరులు పాల్గొన్నారు.

'మానుగట్ట' కష్టాలు తీరనున్నాయా?



గ్రామంలో పాడైపోయిన చేతిపంపును పరిశీలిస్తున్న అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని దబ్బనూతుల కొత్తూరు పంచాయతీ పరిధిలోని మానుగట్ట గ్రామ ప్రజల ఇబ్బందులు తీరనున్నట్లు తెలుస్తోంది. వీరి సమస్యలపై అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో.. సమస్యలు పరిష్కారమవుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళితే.. మానుగట్ట గ్రామ ప్రజలు 40 ఏళ్ల క్రితం వలస వచ్చిన ఆదివాసీలు. వీరికి సరైన రోడ్డు మార్గం, నీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, ప్రభుత్వ పథకాలు అందక అనేక ఇబ్బందులు పడేవారు. వారి దుస్థితిపై పలు పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఇప్పటికి వారి బాధలు తీరే సమయం వచ్చింది. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు ఎంపీడీఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారుల బృందం మానుగట్ట గ్రామంలో గురువారం పర్యటించి గ్రామస్తులతో సమావేశం అయింది. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విద్యుత్ లైన్ నిర్మాణానికి.రూ.16 లక్షలు, రోడ్డు నిర్మాణానికి (3.3కిలోమీటర్లు) రూ.1కోటి 10లక్షలు, చేతిపంపుల ఏర్పాటుకు రూ.1లక్షా 44వేలు, అలాగే ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ, వంటశాలకు షెడ్డు, నూతన అంగన్‌వాడీ భవనం, గోడల నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపారు.అలాగే మండల స్థాయిలో మరికొన్ని పనులు చేపట్టనున్నారు. పాఠశాలలో తెలంగాణ క్రీడామైదానం ఏర్పాటు, ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం పురిగుడిసెలో ఉన్నందున పంచాయతీ నిధులతో రేకుల షెడ్డు నిర్మాణం, పిల్లలకు కావాల్సిన ఆట వస్తువుల ఏర్పాటు, ప్రతి నెలా మొదటి వారంలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంపు, ప్రస్తుతం ఉన్న సోలార్ లైట్లకు పంచాయతీ నిధులతో బ్యాటరీల ఏర్పాటు, గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్ మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించినట్టు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మీ, ఎంపీఓ ముత్యాలరావు, పర్ణశాల డాక్టర్ రేణుకారెడ్డి, సీడీపీఓ సలోమి, సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, సహనా సుల్తానా, పంచాయత్ రాజ్ ఏఈ శ్రీరామ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాము, విద్యుత్ శాక ఎస్ఈ రాజేష్, పంచాయతీ కార్యదర్శి సర్వేశ్వరావు, విద్యాశాఖ ఏజే ప్రభాకర్, ఆశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.